అందరికీ ఆరోగ్యం 'సురక్ష' ధ్యేయం

- గ్రామాల్లో చురుగ్గా సాగుతున్న ఆరోగ్య సర్వే
- సాధారణ, దీర్ఘకాలిక రోగుల గుర్తింపు
- ఈ నెల 30 నుంచి మెడికల్ క్యాంపులు

ఆలూరు రూరల్/తుగ్గలి: ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వైద్య వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు చేస్తోంది. తాజాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది. సాధారణ, దీర్ఘకాలిక రోగులను గుర్తించి మరింత మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

విస్తృతంగా ఇంటింటి సర్వే

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేపట్టారు. తుగ్గలి మండలంలో 18 సచివాలయాల పరిధిలో రెండు పీహెచ్‌సీలు, 16 విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందిస్తున్నారు. సర్వేలో భాగంగా వైద్య సిబ్బంది ప్రాథమిక పరీక్షలు చేసి ఆరోగ్య సమస్యలను గుర్తిస్తున్నారు. సర్వేలో గర్భిణులు, బాలింతలు, తగిన బరువు లేని పిల్లలు, క్షయ, కుష్ఠు, డెంగీ, మలేరియా, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిపై దృష్టి సారిస్తున్నారు. సర్వే సమయంలో ఫోటో తీసి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఈనెల 30 నుంచి షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో ఇద్దరు డాక్టర్ల పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహిస్తారు. సర్వేలో గుర్తించిన రోగులందరికీ వైద్య శిబిరంలో చికిత్స అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలు, పాఠశాల ఆవరణం లేదా అనువైన భవనాల వద్ద శిబిరాలు ఏర్పాటు చేస్తారు. ఈ బాధ్యతలను మండలాల్లో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఆయా పీహెచ్‌సీల వైద్యులకు అప్పగించారు. మండలాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను విభజించి ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.


ముక్కెల్లలో మహిళకు బీపీ పరీక్షలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ ఉమేరియా

ఇదీ లక్ష్యం

- ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సర్వే చేసి ఆరోగ్య సమస్యలు పరిష్కరించడం
- వలంటీర్లు వారి క్లస్టర్ పరిధిలోని ఇళ్లకెళ్లి ఏఎన్‌ఎంల షెడ్యూల్ తెలియజేస్తారు.
- ఏఎల్‌ఎంలు, ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేస్తారు.
- ఆరోగ్య వివరాలను కేస్ షీట్‌తో పాటు టెస్టుల రిపోర్టులను వైద్యులకు అందుబాటులో ఉంచుతారు.
- ఆరోగ్య శిబిరాల్లో రోగులను వైద్యులు పరీక్షించి మందులు అందజేస్తారు.
- అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు.

ఇంటికే వచ్చి వైద్య పరీక్షలు చేశారు



నేను ఆలూరు కోయనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాను. గత నాలుగేళ్లుగా వెన్నుముక క్యాన్సర్‌తో బాధపడుతున్నా. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది మా ఇంటివద్దకే వచ్చి వైద్య పరీక్షలు చేశారు. నా ఆరోగ్య స్థితిగతులు రాసుకున్నారు. మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు. నాకు వైద్యం అందించేందుకు ముందుకు వచ్చిన జగనన్నకు రుణపడి ఉంటాను. – ఆసియా బేగం, ఆలూరు

ఎంతో మేలు



వైద్య సిబ్బంది ఇంటివద్దకే వచ్చి రక్త, బీపీ, షుగర్, ఇతర వైద్య పరీక్షలు చేశారు. గతంలో ఎన్నడూ ఇలా ఇళ్లకు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించిన దాఖలాలు లేవు. అనారోగ్యం బారిన పడితే వ్యయప్రయాసలు పడి పత్తికొండ ఆస్పత్రులకు వెళ్లే వాళ్లం. ఈ ప్రభుత్వంలో వైద్య సిబ్బంది ఇంటివద్దకే వచ్చి వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉంది. వైద్యం కోసం పట్టణాలకు వెళ్లే బాధలు తగ్గాయి. – సుజాతమ్మ, ముక్కెల్ల

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ఈనెల 15వ తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్నాం. 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య సేవలందిస్తాం. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి స్థానికంగా వైద్యం అందించడంతో పాటు మెరుగైన వైద్యం అవసరమైతే స్పెషలిస్టు వైద్యులకు, ఆస్పత్రులకు సిఫార్సు చేస్తాం. ఈ అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలి. – ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి, తుగ్గలి పీహెచ్‌సీ

క్లుప్తంగా

బాసర సరస్వతీ దేవిని దర్శించుకున్న మంత్రి

భైంసా: నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆదివారం బాసర చేరుకున్న మంత్రి తన మనువడు ఇషన్‌సాయితో అక్షరాభ్యాసం చేయించారు. అంతకుముందు మంత్రికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఆలయంలో విశిష్ట పూజలు చేయించారు. ప్రధాన అర్చకులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి


ఆపరేషన్ చేయంచుకున్న వ్యక్తితో జెడ్పీటీసీ తదితరులు

మద్దికెర: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. ఆదివారం ఆపరేషన్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు 9 రోజుల పాటు కంటి వైద్య శిబిరం నిర్వహించేందుకు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కంటిలో పొర ఉన్న వారికి ఇక్కడే ఏర్పాటు చేసిన మొబైల్ వాహనంలో ఆపరేషన్లు చేయడం జరుగుతుందని, తీవ్రమైన సమస్యలు ఉన్న వారికి చెన్నైలోని శంకర్ నేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. సచివాలయ కన్వీనర్ తాలూరి వెంకటేశ్వర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా ఆరోగ్య సర్వే


ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర: అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేదలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు భరోసా ఇచ్చేలా జగనన్న 'జగనన్న ఆరోగ్య సురక్ష పథకం(మేలు చేస్తుందని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి సంబంధించి వైద్య సిబ్బంది చేపట్టిన ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో వైద్య సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు సహకరించి పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు నమోదు చేసి అధికారులకు పంపడమే గాకుండా వారికి తగిన వైద్య సదుపాయం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎన్ఎం గాయత్రి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ కరెన్న, మోనయ్య

ఎమ్మిగనూరురూరల్: పట్టణ సమీపంలోని మంత్రాలయం రోడ్డు జాతీయ రహదారిలో ఆదివారం ఉదయం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు బైకిస్టులు గాయాలపాలయ్యారు. నందవరం మండలం హాలహార్వికి చెందిన కరెన్న ముగతి వద్ద మట్టి పనుల కోసం వచ్చి టిఫిన్ కోసం ఎమ్మిగనూరుకు బైక్‌పై వస్తున్నాడు. ముగతి ఫారం దగ్గర వే బ్రిడ్జి వద్ద కరెన్న బైక్‌కు ఎదురుగా వచ్చిన మోనయ్య బైక్ ఢీకొనటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం పోలీస్ రోడ్ సెఫ్టీ వాహనంలో ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు


పూజలందుకుంటున్న మాళ మల్లేశ్వర స్వామి

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారాన్ని పురస్కరించుకుని ప్రధాన పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, భండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహా మంగళారతి, అర్చనలతో పాటు రుద్రాభిషేక ఇతర ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

రైతన్నకు పెద్ద కష్టం


జొన్నగిరిలో ఆముదం పంటను తొలగిస్తున్న దృశ్యం

తుగ్గలి: వర్షాభావంతో సరైన పెరుగుదల లేకపోవడంతో మండల పరిధిలోని జొన్నగిరిలో బ్రహ్మారెడ్డి అనే రైతు ఆముదం పంటను తొలగించారు. ఆయన తనకున్న మూడెకరాలలో ఆముదం పంట సాగు చేశాడు. ఖరీఫ్ ఆరంభం నుంచి సరైన వర్షాలు లేక పంట ఎదుగుదల లోపించింది. సీజన్ ముగుస్తుండడంతో ఎలాగూ ఇక పంట దిగుబడి రాదనే ఉద్దేశంతో ఆదివారం ట్రాక్టర్‌తో పంటను తొలగించాడు. దాదాపు రూ.60 వేల దాకా నష్టపోయినట్లు రైతు వాపోయాడు.

రమణీయం.. దక్షిణామూర్తి రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలూరు: ఆస్పరి మండలం కారుమంచి గ్రామంలో శ్రీ దక్షిణామూర్తి స్వామి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు మధ్య రథోత్సవం వైభవంగా నిర్వహించారు. దక్షిణమూర్తి ఉత్సవమూర్తిని ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తుల జయజయధ్వానాలు, మేళతాళాలు, భాజాభజంత్రీలు, డోలు సన్నాయిల హోరు మధ్య రథంపై కొలువుంచి ప్రత్యేక పూజలు చేశారు. అశేష భక్తజనం మధ్య శ్రీ దక్షిణామూర్తి ఆలయం నుంచి శివాలయం వరకు రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు గణపతి, శాంతి హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. స్థానిక భక్తులే గాక ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ తదితర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కుబడులు చెల్లించారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఎస్‌ఐ వరప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

రైతులను ఆదుకోవాలి


అగ్రహారం గ్రామంలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న హనుమంతుయాదవ్

ఆలూరు: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు హనుమంతుయాదవ్ కోరారు. ఆలూరు మండలం మొలగవెల్లి, కరువెల్లి, అరికెర, అగ్రహారం గ్రామాల్లో దెబ్బతిన్న పొలాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, కనీసం పెట్టుబడులు కూడా చేతి కందే పరిస్థితులు లేవని వాపోయారు. అప్పుచేసి పంటల సాగుకు పెట్టిన పెట్టుబడులు నేలపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న పంటలకు తగిన నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఈరన్న, నాయకులు ఉన్నారు.

దళితుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం


మాట్లాడుతున్న కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి

ఎమ్మిగనూరుటౌన్: దేశంలో దళితులను అణగదొక్కి మతోన్మాదాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెచ్చగొడుతోందని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేవసహాయం, ఆనంద్‌బాబు ఆరోపించారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన దళిత రక్షణ యాత్రలో వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు దళితులు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. బీజేపీ అభివృద్ధి అనే మాటను పక్కన పెట్టి కులం, మతం పేరుతో వైషమ్యాలను సృష్టిస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటుందన్నారు. ఈ విధానాలను తిప్పికొట్టేందుకు ఈనెల 29న విజయవాడలో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కేవీపీఎస్ నాయకులు రాజా రమేష్, గుంటిప్ప తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను అరికట్టి రక్షణ కల్పించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు కోరారు. కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దళిత రక్షణ యాత్ర జీపుజాతా ఆదివారం గోనెగండ్లకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ దళిత హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు కేవీపీస్ నాయకులు కరుణాకర్, విజయమ్మ, రాజు, తిమ్మన్న, మారేష్, దీవన్న తదితరులు పాల్గొన్నారు.

హెబ్బటంలో జష్నే మిలాద్

హొళగుంద: మండల పరిధిలోని హెబ్బటం గ్రామంలో శనివారం రాత్రి జష్నే మిలాద్ నబి జల్సా కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక మసీదులో ముస్లింలు హాజరై బయాన్ విన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదోనికి చెందిన మతపెద్ద మహమ్మద్ జాకీర్ ఆఫీజ్ సాబ్ ఖురాన్ సందేశం, అందులోని సారాంశం గురించి వివరంగా బోధించి సమాజంలో పాటించాల్సిన పద్ధతుల గురించి చెప్పారు.

'ఆస్పిరేషనల్ బ్లాక్'కు ఎంపిక

చిప్పగిరి: ఈ నెల 30న ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమానికి మండలం నుంచి నలుగురు గ్రామ సర్పంచులు, కార్యదర్శులకు అవకాశం లభించిందని ఎంపీడీఓ సీవీ కొండయ్య తెలిపారు. చిప్పగిరి, నంచర్ల, నేమకల్లు, డేగులహాలు సర్పంచులు గోవిందరాజులు, భీమన్న, ప్రేమ్‌కుమార్, నీలకంఠ, పంచాయతీ కార్యదర్శులు సిసింద్రి, నరేంద్ర, నరసింహులు, సురేంద్రనాథ్ ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చేపట్టాల్సిన విధానాలపై సమావేశంలో వివరిస్తారు.

ఎనీ టైం మూసివేతే!


మూతబడిన కెనరా బ్యాంకు ఏటీఎం

చిప్పగిరి: స్థానిక కెనరా బ్యాంకు ఏటీఎం గత వారం రోజులుగా మూత పడడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు ఈ ఒక్క శాఖ మాత్రమే ఉండడంతో నగదు విత్‌డ్రా కోసం వచ్చిన వారు ఏటీఎం మూసి వేసి ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగదు డ్రా కోసం బ్యాంకు లోపలికి వెళితే రద్దీ ఎక్కువగా ఉంటోందని, ఒక రోజంతా సమయం కేటాయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు అధికారులు స్పందించి ఏటీఎం సేవలు అందుబాటులోకి తేవాలని ఖాతాదారులు కోరుతున్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకునేలా కరువు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం కోరారు. ఆదివారం పట్టణంలోని ఏపీ ఎన్జీఓ భవన్‌లో ఏపీ రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతు రుణాలు రద్దు చేసి వంద శాతం పంటల బీమా వర్తింపజేయాలని కోరారు. రబీ సీజన్‌కు 90 శాతం సబ్సిడీతో విత్తనాలను అందించాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, నాయకులు పంపణ్ణగౌడ్, రాజాసాబ్, జగదీష్, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులకు బీమా సౌకర్యం

తుగ్గలి: గృహ సారథులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు అన్నారు. ఆదివారం ఆయన శభాష్‌పురంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చడంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు తమ వంతు కృషి చేస్తున్నారన్నారు. వారికి బీమా సౌకర్యం కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్ సామాజిక భద్రత కల్పిస్తున్నారని చెప్పారు. మండలంలో 657 మంది గృహ సారథులకు బీమా నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 90 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. సంబంధిత డాక్యుమెంట్లు సమర్పించి మిగతా వారు కూడా బీమా చేయించుకోవాలన్నారు. ఈ నెలాఖరు నుంచి ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు.

వర్షం కోసం పూజలు

మద్దికెర: మండల పరిధిలో నల్లరేగడి పొలాల్లో ఉన్న దొనపాడు శివాలయంలో వర్షం కోసం పూజ లు సప్త భజనలతో పాటు ప్రతి రోజు చిన్నారులు ఆలయంలోని శివలింగానికి 105 బిందెల నీటితో జలాభిషేకం చేశారు. ఉదయం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గత వారం రోజులుగా స్వామి వారికి పూజలతో పాటు రాత్రి పగలు సప్తభజనలు చేస్తున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

తుగ్గలి: వరుణ దేవుడు కరుణించాలని కోరుతూ తుగ్గలిలో ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో సిద్ధ లింగేశ్వర స్వామి, అమినాబాద్ నాయుడు విరాటపర్వం పారాయణం చేశారు. యువకులు గ్రామ దేవతలకు 101 బిందెల నీటితో జలాభిషేకం చేశారు. వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిపించి పంటలు కాపాడాలని వేడుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామ సమీపంలో కొండ నుంచి గుర్రంపై తిమ్మప్ప స్వామి ప్రతిమను ఉంచి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు


జడెప్ప తాత చిత్రపటాలను ఊరేగిస్తున్న భక్తులు

హొళగుంద: మండల కేంద్రంలోని తేరు బజారుకు ఆనుకుని వెలిసిన జడెప్ప, అయ్యప్ప తాతల ఆరాధనోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. గుంతకల్, సిరుగుప్ప, బళ్లారి, ఆదోని ఇతర దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఏటా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం ఆలయంలో ఆకు పూజ, అభిషేకాలు, అర్చనలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణ చేశారు. అనంతరం తేరు బజారులో భక్తులు జడెప్ప, అయ్యప్ప తాతల చిత్రపటాలను ఊరేగించారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.

మారెమ్మ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో వెలసిన శ్రీమాతా మారెమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామస్థులు గ్రామ శివారులోని ముఖద్వారానికి పూజలు చేశారు. ప్రతి ఇంటి నుంచి కాయ కర్పూరంతో వచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా బంధుమిత్రులతో గ్రామం కళకళలాడుతోంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రాత్రి జిల్లా స్థాయి భజన పోటీలు జరిగాయి. సోమవారం అమ్మవారిని ప్రత్యేక నగలతో ఆలంకరంచి ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో పూజించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు ముగ్గులు, పొట్టేళ్ల పోటీలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు, పొట్టేళ్ల పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి దాతల సహకారంతో నగదు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. అలాగే రాత్రి ప్రముఖ గాయని మధుప్రియతో జానపద కచేరి కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

ఎమ్మిగనూరుటౌన్: ఆటో వర్కర్ల సమస్యలను పరిష్కరించి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు కోరారు. ఆదివారం పట్టణంలోని సోమేశ్వర టాకీస్ సర్కిల్‌లో ఆటో వర్కర్స్ యూనియన్ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని అదేవిధంగా ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ అధ్యక్షుడు రంగన్న, ఏఐటీయూసీ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిదరోతున్న నిఘా నేత్రం


శివ సర్కిల్‌లో పనిచేయని సీసీ కెమెరాలు


ఆర్టీసీ బస్టాండ్ వద్ద పనిచేయని కెమెరాలు

- పట్టణ ప్రధాన కూడళ్లల్లో 32 సీసీ కెమెరాలు
- ప్రస్తుతం పనిచేస్తున్న కెమెరాలు ఐదు మాత్రమే
- మరమ్మతులకు నోచుకోని వైనం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా శాంతి భద్రతలతోపాటు ప్రజల రక్షణ, ట్రాఫిక్ సమస్యలపై నిఘా ఉంచేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం పట్టణంలో నిఘా నేత్రం నిద్రపోతున్నట్లు ఉంది. పట్టణంలో 1.20లక్షలకు పైగా జనాభా ఉన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణ పోలీసులు పట్టణంలోని ప్రధాన కూడళ్లు, బైపాస్‌తో పాటు నలువైపులా 32 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గత కొన్ని రోజులుగా ఐదు సీసీ కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో కెమెరాలు పనిచేయకపోవటంతో ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ నలువైపులా 32 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా వాటిలో ప్రధాన కూడలైన సోమప్ప సర్కిల్, వైఎస్ఆర్ సర్కిల్‌లో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. మిగతా శివ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, ఆదోని రోడ్ వై జంక్షన్, కర్నూల్, గూడురు బైపాస్ రోడ్డు, మార్కెట్ యార్డ్ రోడ్, మంత్రాలయం, కోసిగి రోడ్, శ్రీనివాస, సోమేశ్వర, ఓం శాంతి సర్కిల్స్, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు వివిధ కారణాల చేత పనిచేయడం లేదు. దీంతో దొంగతనాలు, ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాలు చేసిన వారు సులభంగా తప్పించుకొని ప్రధాన కూడళ్లను దాటుకొని పరార్ అవుతున్నారు. అదే కెమెరాలు పనిచేస్తే వాటిలో నమోదైన దృశ్యాల ఆధారంగా నిందితులు, అనుమానితులను పట్టుకునేందుకు సులభంగా ఉండేది. ఈ మధ్య కాలంలో ఆర్టీసీ బస్టాండ్‌లో చిల్లర దొంగతనాలు ఎక్కువ అవుతున్నాయి. బస్టాండ్‌లో కూడా సీసీ కెమెరా ఉన్నా పనిచేయకపోవడంతో దొంగలు తమ పని తాము కానిచ్చేస్తున్నారు. వీటితో పాటు పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది, ఆటోలను ఎక్కడ పడితే అక్కడ నిలపుతున్నారు. గతంలో సీసీ కెమెరాలు పనిచేస్తున్నప్పుడు పోలీస్‌స్టేషన్లో కెమెరాల్లో చూసి కానిస్టేబుల్ ట్రాఫిక్ సమస్యను నివారించేవారు. ఇప్పటికైనా పట్టణ పోలీసులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి నిఘా నేత్రం తెరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం

పట్టణంలో పనిచేయని సీసీ కెమెరాలకు త్వరలో మరమ్మతులు చేయిస్తాం. కెమెరాలు అమర్చిన చోట వైర్లు, ఇతర సాంకేతిక సమస్యల వల్ల సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. కొన్ని చోట్ల వైర్లు తెగిపోయినట్లు మా దృష్టికి వచ్చింది ఎక్కడెక్కడ ఏ సమస్య ఉందో తెలుసుకొని మరమ్మతులు చేయిస్తాం. – మస్తాన్‌వలి, పట్టణ ఎస్ఐ, ఎమ్మిగనూరు

సురక్షతో ప్రజారోగ్యానికి భరోసా


నదికైరవాడిలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


వెల్దుర్తి-1 హెల్త్ క్లినిక్ పరిధిలో ఆరోగ్య సర్వే చేస్తున్న ఏఎన్ఎం రంగవల్లి, వైద్య సిబ్బంది

నందవరం: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంతో ప్రజారోగ్యానికి భరోసా ఏర్పడుతుందని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సౌజన్యలత అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నదికైరవాడి, గురజాల, కనకవీడు గ్రామాల్లో వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య సిబ్బంది బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేపట్టి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటింటి సర్వే పూర్తిచేసి ఈ నెల 30వ తేదీ నుంచి గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తామన్నారు. 30న గురజాల, అక్టోబర్ 3వ తేదీన కనకవీడు-1, 4వ తేదీన కనకవీడు-2, 5వ తేదీ సోమలగూడూరు-2, 6న సోమలగూడూరు-1, 7వ తేదీన నాగలదిన్నె-1, 10వ తేదీన నాగలదిన్నె-2, 11వ తేదీన పెద్దకొత్తిలి, 12న పూలచింత, 13న నదికైరవాడి, 17న ఇబ్రహీంపురం, 18న మాచాపురం, 19వ తేదీన హాలహర్వి-1, 20వ తేదీ హాలహర్వి-2, 25న ముగతి-1, 26న ముగతి-2, 27వ తేదీన నందవరం-1, 28వ తేదీ నందవరం-2, 31వ తేదీ నందవరం-3 గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తామన్నారు. ఏఎన్ఎంలు రాములమ్మ, ప్రియాంక, పుష్పావతి, ఆశా వర్కర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండలంలోని పలు హెల్త్ క్లినిక్‌ల పరిధిలోని గ్రామాలలో ఆరోగ్య సర్వే కొనసాగుతోంది. ఆయా గ్రామాల వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలతో కలిసి వెళ్లి తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులను విచారిస్తున్నారు. అవసరమైన వారికి అక్కడికక్కడే బీపీ, షుగర్, హెచ్‌బీ తదితర పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సేవలను వివరిస్తూ, ఉచితంగా వైద్య సేవలు అందే విధానం విశదీకరిస్తున్నారు. ప్రత్యేక ఆరోగ్యశ్రీ బ్రోచర్లు అందించి ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. అనారోగ్యంతో ఉన్నవారిని గుర్తించి ఈ నెల 30నుంచి ప్రారంభమయ్యే వైద్య శిబిరంలో చికిత్స పొందాలని సూచించి టోకెన్లు అందిస్తున్నారు. వైద్య శిబిరాలలో స్పెషలిస్టు డాక్టర్లు ఆధునిక యంత్రాలతో తగు పరీక్షలు చేసి చికిత్స అందిస్తారని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

హొళగుంద: జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని హొళగుంద పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ వలంటీర్లకు సూచించారు. ఆదివారం ఆయన వలంటీర్లతో కలిసి హొళగుందలో సర్వేలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబసభ్యులకు సంబంధించి 7 రకాల ఆరోగ్య వివరాలను నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు. గడువులోపు సర్వే పూర్తి చేయాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.